

# పొగబండి కథలు



— ఐలేటి శ్రీనివాసభాను



ఆ రోజు...కాళ్లూ చేతులూ కట్టేసినట్టనిపించింది గురుమూర్తికి. ఇన్నాళ్లూ లభించిన ప్రాధాన్యం పలచబడినట్లు, పెద్దరికం చిన్నబోయినట్లు, ఇంట్లో కొడుకులూ, కోడళ్లూ, మనవడూ, మనవరాలూ- అందరూ కలిసి, సైడింగ్‌లోని సిక్‌వ్యాగన్ లాగా ఓ మూల కూర్చోమని చెప్పకనే చెబుతున్నట్లు గురుమూర్తికి అనిపించింది. మామూలుగా అయితే రాజధాని ఎక్స్‌ప్రెస్ కోసం మిగతా బళ్లు దారిచ్చినట్లుగా- ఆ ఇంట్లోని అందరూ గురుమూర్తికి ప్రాధాన్యం ఇచ్చేవారు. పెద్దపీట వేసేవారు.

# అనుభవం - ప్రతిఫలం

ఇంట్లో అందరికన్నా ఆయనే ముందుగా లేచేవాడు. ఆయన కాలకృత్యాలు తీర్చుకోడానికి ఎవరూ అడ్డు వచ్చేవారుకాదు. మొహం కడుక్కోగానే ఫిల్టర్ కాఫీ సిద్ధం. న్యూస్‌పేపర్ చదివి, గెడ్డం గీసుకోగానే బాత్‌రూమ్‌లోని బకెట్‌లో వేణ్ణీళ్ళు సిద్ధం. స్నానం, పూజ పూర్తికాగానే వేడివేడిగా అన్నం సిద్ధం. ఇంటికి తెచ్చుకొన్న ఆఫీస్ వర్క్‌ని ముందురోజు అర్ధరాత్రి వరకు ఆపన్నది లేకుండా పూర్తిచేసి, ఉదయాన్నే అఫీసులో అందరికన్నా అరగంటముందుగా మన గురుమూర్తి సిద్ధం.

ఆ రైల్వే జోనల్ ఆఫీసులో గురుమూర్తి పనిచేసే సీట్ అలాంటిది. గుక్క తిప్పుకోడానికి వీలుండదు. ఫైల్ మీద ఫైల్. సవాలక్ష గణాంకాలు. చాంతాడంత డ్రాఫ్టింగులు. విచిత్రం ఏమిటంటే ఆయన విసుక్కొనేవాడు కాదు. తన ఫైళ్లతోపాటు పక్క సీట్లో ఫైళ్లని సైతం పరిష్కరించే బాధ్యతని నెత్తిన వేసుకొనేవాడు. సెలవు రోజుల్లో సైతం సీటుకు అంటుకు పోయి ఫైళ్ల సమాధిలో మునిగిపోయేవాడు. అందుకు ఫలితంగా గురుమూర్తికి పెద్దగా ప్రమోషన్లు రాకపోయినా పురస్కారాలు లభించేయి. రైల్వే బోర్డు నుంచి రెండు సార్లు అవార్డులు అందుకున్నాడు గురుమూర్తి.

గురుమూర్తి తండ్రి రైల్వే యార్డులో పాయింట్స్ మెన్. ఓసారి నైట్‌షిఫ్టులో ప్రమాదం జరిగింది. హంప్‌యార్డ్‌లో దూసుకొచ్చిన వేగన్ కింద పడి గురుమూర్తి తండ్రి మరణించాడు. ఆ సమయానికి గురుమూర్తి పదోతరగతి పాసై, తండ్రి చదివించలేకపోవడంతో మూడేళ్లుగా ఖాళీగా వున్నాడు. తండ్రి చనిపోవడంతో సానుభూతి కోటా కింద గురుమూర్తికి రైల్వేలో క్లాస్ ఫోర్ ఉద్యోగం ఇచ్చారు. పదో తరగతిలో మంచి మార్కులు రావడం వల్ల, ఆఫీసర్ల బంగ్లాలో ఊడిగం చేయాల్సిన పని లేకుండా ఆఫీస్‌లోని ఆర్ అండ్ బి సెక్షన్‌లోని టపాల్స్ చూసే పనిలో వేశారు.

గురుమూర్తి యమ షార్ప్. జ్ఞాపక శక్తీ ఎక్కువే. ఆఫీసులో పని త్వరగా పూర్తి చేసి, ఖాళీ సమయంలో గోళ్లు గిల్లుకోకుండా ప్రైవే


Bali

టుగా పరీక్షలు రాశాడు. డిగ్రీ సంపాదించాడు. ప్రమోషన్ల కోసం ఏళ్ల తరబడి ఎదురు చూడాల్సిన ఆ సెక్షన్‌లో చీఫ్ క్లర్క్ స్థాయికి చేరుకున్నాడు. ఆఫీస్ సూపరిడెంటెంట్ కావలసిన వాడే. పోస్టు శాంక్షన్ కాలేదు. అందువల్ల పాపం గురుమూర్తి చీఫ్‌క్లర్క్‌గానే సీట్లో రిటైర్ అయిపోయాడు. అదిగో, అలా రిటైర్ అయిన మర్నాటి నుంచి గురుమూర్తిలో ఏదో వెలితి. మానసికమైన ఒంటరితనం... ఇంట్లో ఎప్పుడూ లభించే ప్రాధాన్యం ఆనాటి నుంచి హఠాత్తుగా పట్టాలు తప్పిందన్న భావం!

ఆరోజు కాఫీ లేట్టైంది. న్యూస్ పేపర్‌ని కొడుకులిద్దరూ వాటాలేసుకున్నారు. బాత్‌రూమ్‌లో వేన్నీళ్లు లేవు సరికదా..తనకోసం ఖాళీ లేదు. ''మావయ్యగారూ అన్నం వడ్డించాను'' అంటూ ఏ ఒక్క కోడల్నించీ పిలుపు రాలేదు. పనిష్మెంట్‌కి గురై డి-ప్రమోట్ అయినట్లు బాధ పడ్డాడు గురుమూర్తి. చనిపోయిన భార్య గుర్తు కొచ్చింది. కన్నీళ్లొచ్చాయి.

నలభై యేళ్ల పాటు తీరిక లేకుండా గడిపిన గురుమూర్తి నాలుగు రోజులు ఖాళీగా గడపలేక పోయాడు. అయిదో రోజు ఆఫీసులో ప్రత్యక్షం అయ్యాడు. ఆయన్ని చూడగానే సెక్షన్‌లో వాళ్లకి ప్రాణాలొచ్చాయి. కారణం. పెండింగ్ ఫైల్స్, బేతాళ ప్రశ్నల్లాంటి ఆడిట్ అబ్జక్షన్స్, అర్థం కాని స్టాటిస్టిక్స్, బొత్తిగా చేతకాని డ్రాఫ్టింగ్. సెక్షన్‌లో వాళ్లు సాయం చేయమన్నారు. గురుమూర్తి మళ్లీ బిజీ అయిపోయాడు. సెక్షన్‌లో బీరువాల వెనక-పుట్టలోని మునీశ్వరుడిలా ఫైళ్ల పరిష్కారంలో మునిగిపోయాడు.

ఓరోజు ఆఫీస్ సూపరిండెంటెంట్ సాంబమూర్తి ''గురుమూర్తీ, గురుమూర్తీ వెనక ద్వారం నుంచి వెళ్లిపో'' అంటూ కంగారుపడుతూ గురుమూర్తిని కుర్చీలోంచి లేపాడు. గురుమూర్తికి అర్థం కాలేదు. ''ఏం?'' అని అడగబోయాడు. అంతలో పెద్ద దొర ఊడిపడ్డాడు. మనిషి ఎర్రగా వున్నాడు. చెంపలు పొడుగ్గా వున్నాయి. దట్టమైన కనుబొమల్ని కప్పేస్తూ దళసరి కళ్లద్దాలున్నాయి.

''హూ ఆర్ యూ? వాట్ ఆర్ యూ? వై ఆర్ యూ సిటింగ్ హియర్? వాటీజ్ దట్ యూ ఆర్ హ్యాండ్లింగ్ హియర్?'' అంటూ ప్రశ్నల మీద ప్రశ్నలు. స్పాట్ ఎంక్వయిరీ... రిటైర్ అయిన ఉద్యోగి చేతికి కీలకమైన ఫైళ్లను అందించినందుకు ఆ సెక్షన్‌లో ఆఫీసు సూపరిండెంటెంట్ సాంబమూర్తితో పాటు అయిదుగురు సస్పెండ్ అయ్యారు. ''ఇఫ్ యూ ఆర్ సీన్ ఎగైన్ హియర్-యూవిల్ బి హ్యాండెడ్ ఓవర్ టు పోలీస్'' పెద్దదొర గురుమూర్తి వైపు గుడ్లురిమి చూశాడు. గట్టిగా గద్దించి వెళ్లిపోయాడు. ఉపకారానికి పోతే అపకారం.... గురుమూర్తిలో మళ్లీ ఒంటరితనం.

***

ఆరోజు గురుమూర్తి తన జీవితంలో మొదటి పెన్షన్ తీసుకొని, బ్యాంక్ మెట్లు దిగుతున్నాడు. ఎదురుగా రైల్వే జీప్. అందులోంచి-''హమ్మయ్యా రక్షించావ్'' అంటూ ఆఫీస్ సూపరిండెంటెంట్ సాంబమూర్తి ఆదరాబాదరాగా దిగాడు. దిగి, ''నీ కోసం మీ ఇంటికెళ్లాం. బ్యాంక్‌కి వెళ్లావని చెప్పారు. అర్జంట్‌గా పని పడింది. జీప్ ఎక్కు'' అన్నాడు.

''ఏంటి? పెద్ద దొర పోలీస్ కంప్లయింట్ ఇచ్చారా?'' గురుమూర్తిలో అయోమయం.

''జీప్ ఎక్కు మహానుభావా'' గురుమూర్తి జబ్బ పట్టుకొని జీప్ ఎక్కించాడు సాంబమూర్తి. అది తిన్నగా పెద్ద దొర బంగ్లాకి చేరుకుంది. ఎందుకో ఏమిటో దారిపొడుగునా సాంబమూర్తి చెప్పుకొచ్చాడు.

ఆరోజులాగే...ఆ మర్నాడు...మూడోనాడూ కూడా రైల్వే జీప్ గురుమూర్తిని పెద్దదొర బంగ్లాకి తీసుకెళ్లింది. ఆ మూడ్రోజులూ గురుమూర్తి పని తనం, అనుభవం, ఆడిట్ వాళ్ల బేతాళ ప్రశ్నల్ని అత్యంత సులభంగా పూర్వ పక్షం చేసే సామర్థ్యం-అతి క్లిష్టమైన ఓ 'ఆడిట్ అబ్జక్షన్' ఫైల్‌ని అద్భుతంగా పరిష్కరించింది.

తన పరువును కాపాడినందుకు ప్రతిఫలంగా పెద్ద దొరగారి హోదా ప్రోటోకాల్‌ని పక్కనెట్టి ఆటోమేటిగ్గా దిగొచ్చింది. రైల్వే ప్రాజెక్ట్‌ని చూసే ఓ కాంట్రాక్టర్ కంపెనీలో గురుమూర్తికి ఉద్యోగాన్ని సిఫార్సు చేసింది. రిటైర్‌మెంట్ తరువాత-సైడింగ్‌లోని సిక్ వ్యాగన్‌లాగా పడున్నానని బాధ పడ్డ గురుమూర్తి మనసు మెయిన్‌లైన్‌లో రాజధాని సూపర్‌ఫాస్ట్‌లా 'టాప్‌నాచ్' అందుకుంది. ★

## మనోజ్ కుమార్‌ను కొట్టేంత వెర్రివాళ్లా!



బాలీవుడ్‌లో అరవై, డెబ్బై దశకాల్లో దేశభక్తి చిత్రాలకు చిరునామాగా పేరు గాంచాడు మనోజ్ కుమార్. హీరోగా 'షహీద్', దర్శకుడుగా 'రోటీ కపడా ఔర్ మకాన్' లాంటి ఆయన చిత్రాలు ఇప్పటికీ క్లాసిక్స్‌గా పరిగణించబడుతూంటాయి. ఆయన సినిమాలతో పాటు ఆయనకే ప్రత్యేకమైన కొన్ని మేనరిజమ్స్‌కూడా ఆనాటి ప్రేక్షకులకు ఇంకా గుర్తుండే వుంటాయి. పాటల్లో ముఖం దాచుకున్నట్లు చేతుల్ని అడ్డంగా ఉంచుకోవటం ఆయన మేనరిజాల్లో ఒకటి. అప్పటి ప్రేక్షకులకు ఇది స్టైలిష్‌గా అనిపించినా రాను రాను దీన్ని చాలామంది హాస్యానికి అనుకరించడం అలవాటై పోయింది. చాలా సినిమాల్లో దీన్ని హాస్యనటులు అనుకరించారు. ఇటీవల షారుక్ ఖాన్ నటించిన 'ఓం శాంతి ఓం'లో కూడా దీని చుట్టూ కొంత హాస్యం నడిచింది. అందులో ఒక డూప్ నటుడు మనోజ్ కుమార్‌లా ఈ మేనరిజంతో నవ్విస్తాడు. అందులో అతను పోలీసులచేత దెబ్బలు కూడా తింటాడు. అయితే మనోజ్ కుమార్‌కు ఇదేమంత నచ్చినట్టు లేదు. ఇటీవల ఈ విషయమై కదిలిస్తే ఆయనిలా అన్నాడు. ''అది చాలా అసహ్యంగా ఉంది. అసలందులో లాజిక్ ఏముంది? బొంబే పోలీసులు మనోజ్ కుమార్‌ను కొట్టేంత వెర్రివాళ్లా!'' అంటూ మండిపడ్డాడు. అసలు అది తన మేనరిజమే కాదు అంటున్నాడాయన, ''అది నా మేనరిజం కాదు. నా 'క్లర్క్' సినిమాలో ఒక సన్నివేశంలో మాత్రమే నేను ముఖాన్ని చేత్తో చాటు చేసుకుంటాను. ఎందుకంటే ఆ క్లర్క్ అవినీతి పరుడు. ప్రపంచానికి తన ముఖం చూపించుకోలేక అలా మొహం దాచుకుంటాడు,'' అంటూ ఒక పొంతన లేని వివ రణ కూడా ఇచ్చాడు.

